
సారూ.. ఎక్కడికి వెళ్లాలి?

- జిల్లా ఆస్పత్రిలో ఆగిన ఎమ్మార్ఐ, సీటీస్కాన్ యంత్రం
- జాయింట్ కమిషనర్ ఆదేశాలతో నిలిచిన సేవలు
- వెనుతిరుగుతున్న రోగులు



ప్రొద్దుటూరు క్రైం : ఎమ్మార్ఐ, సీటీస్కాన్ తీయించుకోవడం ఖర్చుతో కూడుకున్న పని. సీటీ స్కాన్‌ను ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లలో తీసుకుంటే రూ.3,000-6,000 వరకు, ఎమ్మార్ఐ అయితే రూ. 7,000-1,4000 వరకు ఖర్చు అవుతుంది. పేదలకు వీటి భారాన్ని తగ్గించేందుకు కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ఉచిత ఎమ్మార్ఐ, సీటీస్కాన్ విభాగాలను ఏర్పాటు చేసింది. ప్రారంభం నుంచి రెండు రోజుల క్రితం వరకు ఏనాడు వీటి నిర్వహణలోనూ.. సేవలు అందించడంలోనూ ఇబ్బందులు తలెత్తలేదు. అయితే ఉన్నఫలంగా రోగులకు అత్యవసరమని వైద్యులు భావిస్తే అప్పుడు రాస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతూ లబోదిబోమంటున్నారు.

రోగులకు అవస్థలు

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి ప్రతి రోజు సుమారు రూ. 8,00-1,100 వరకు ఓపీ ఉంటుంది. ఇక్కడికి ప్రొద్దుటూరు, పరిసర ప్రాంత ప్రజలతో పాటు మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు, ముద్దనూరు, పులివెందుల, నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, చాగలమర్రి, తదితర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వస్తుంటారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే మొదలు అన్ని రకాల స్కానింగ్‌లను ఉచితంగా చేస్తారు. ఇలా ప్రతి రోజు సీటీ స్కాన్ 40-45, ఎమ్మార్ఐ స్కాన్‌లు 20-25 వరకు చేయించుకుంటారు. రూ. వేలల్లో ఖర్చు అయ్యే సీటీ, ఎమ్మార్ఐ స్కానింగ్‌లను ఆస్పత్రిలోనే ఏర్పాటు చేసి ఉచితంగా చేస్తుండటంతో ప్రజలకు సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు ఈ సేవలు ఆగిపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.

జాయింట్ కమిషనర్ ఆదేశాలతో నిలిచిపోయిన స్కానింగ్‌లు

ఈ నెల 6న వైద్యవిధాన పరిషత్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిశోర్ జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ప్రజలకు వైద్యం ఎలా అందుతోంది.. రోజు ఎంత మంది చికిత్స చేయించుకుంటున్నారు.. మందుల సరఫరా ఎలా ఉంది.. ఇలాంటి వాటిపై జాయింట్ కమిషనర్ ఆస్పత్రి అధికారులతో మాట్లాడలేదు. వైద్యులను పిలిపించి సీటీ, ఎమ్మార్ఐలు ఇష్టాను సారంగా రాస్తున్నారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు స్కానింగ్‌లు రాస్తే సస్పెండ్ చేస్తానంటూ వారిపై చిందులేశారు. దీంతో శుక్ర, శనివారాల్లో వైద్యులెవరూ స్కానింగ్ రాయలేదు. ఈ రెండు రోజుల్లో దూరప్రాంతాల నుంచి వచ్చిన రోగులు నిరాశగా వెనుతిరిగి వెళ్లారు.

సివిల్ సర్జన్‌లే స్కానింగ్ రాయాలట..

జిల్లా ఆస్పత్రిలో నలుగురు మాత్రమే సివిల్ సర్జన్‌లు ఉన్నారు. వీరిలో సర్జరీలు చేయడానికి కొందరు వెళ్లగా, కొందరు సర్జన్‌లు వార్డుల్లో రౌండ్స్ (రోగుల పరిశీలన) వేస్తుంటారు. దీంతో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు మాత్రమే ఓపీలో, అత్యవసర విభాగంలో ఉండాల్సి వస్తోంది. మరో సివిల్‌సర్జన్, మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు మాత్రం రాజకీయ నాయకులు, ప్రముఖుల సిఫార్సుల మేరకు సీటీ, ఎమ్మార్ఐ స్కాన్‌లు రాస్తూ వచ్చారు. అయితే సూపరింటెండెంట్‌ను కూడా స్కానింగ్‌లను రాయొద్దని జాయింట్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎప్పుడూ రోగులతో రద్దీగా ఉండే సీటీ, ఎమ్మార్ఐ విభాగాలు రెండు రోజుల నుంచి ఖాళీగా కనిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి



భుజం, వెన్ను భాగంలో నొప్పి, చెయ్యి లాగుతుండటంతో వైద్యులు ఎమ్మార్ఐ తీయించుకోమని సూచించారు. ఎమ్మార్ఐ స్కానింగ్ తీయించుకోవాలని రెండు రోజుల నుంచి ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తిరుగుతున్నాను. వైద్యులు మాత్రం స్కానింగ్ రాయమంటున్నారు. డబ్బు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్‌లో స్కానింగ్ తీయించుకునే స్థోమత మాకు లేదు. ఎప్పుడూ లేని ఇప్పుడు ఎందుకు ఆంక్షలు పెట్టారో అర్థం కాలేదు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- మస్తాన్, కానపల్లె, ప్రొద్దుటూరు మండలం

రెండు రోజులుగా తిరుగుతున్నా..



నాకు గతంలో టీబీ ఉండేది. ఇప్పుడు కొంత వరకు బాగానే ఉంది. అయితే మూడు రోజుల నుంచి ఆయసం, దగ్గు ఎక్కువగా ఉండటంతో వైద్యుడు సీటీ స్కాన్ తీయించుకోమని చెప్పాడు. స్కానింగ్ కోసం రెండు రోజుల నుంచి ప్రొద్దుటూరు పెద్దాసుపత్రికి తిరుగుతున్నా వైద్యులు రాయలేదు. ఇక్కడ చేయకుంటే మా లాంటి పేదలు ఎక్కడికి వెళ్తారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వైద్య సదుపాయాలకు అంతరాయం కలగకుండా చూడాలి.

- జాఫర్ హుస్సేన్, జిన్నారోడ్డు, ప్రొద్దుటూరు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ట వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం సీతారామ లక్ష్మణ సమేత హనుమత్ విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ట మహోత్సవం వేలాది మంది గ్రామస్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5.21 గంటలకు మృగశిర నక్షత్ర యుక్త శుభలగ్నంలో ఈ కార్యక్రమం జరిపారు. ప్రత్యేక పూజల నడుమ ఆలయంలో సీతారాముల లక్ష్మణ హనుమత్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భారీ కేన్ సాయంతో శిఖర, ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. 10.45 గంటల నుంచి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించగా, ఆలయ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఐఏఎస్, సీఏడీఏ కమిషనర్ శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి దంపతులు సీతారాముల కల్యాణంలో కూర్చుకున్నారు. తమ సొంత గ్రామంలో జరుగుతున్న ఆలయ ప్రతిష్ట వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కుటుంబీకులు మూడు రోజుల పాటు హాజరయ్యారు. ఈ వేడుకల్లో నిర్వహించిన చెక్క భజనలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు హాజరైన ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సీపీ సుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, శెట్టిపల్లె రమేష్ రెడ్డి, సిద్దారెడ్డి, వేమారెడ్డి, ఓబుళరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.



నక్కలదిన్నెలో రామాలయంలో కొలువుదీరిన సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహాలు

ఓర్వలేకే మున్సిపల్ వైస్ చైర్మన్‌పై ఆరోపణలు

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ మైనార్టీ నాయకులు ఓర్వలేక మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్లు ఖాజాపై విమర్శలు చేస్తున్నారని ప్రొద్దుటూరు నియోజకవర్గ ఐటీవింగ్ అధ్యక్షుడు చౌదూరు మహబూబ్‌బాషా మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మైనార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనా రాహిత్యంతో టీడీపీ నాయకుడు ఖలీల్ వైస్ చైర్మన్‌పై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ఆయిల్‌మిల్లు ఖాజా 30 ఏళ్ల పొలిటికల్ ఇండస్ట్రీ అని చెప్పింది తనది కాదని, టీడీపీ నాయకుడు ముక్తియార్‌ను ఉద్దేశించి అన్నారన్నారు. దీన్ని అర్థం చేసుకోకుండా టీడీపీ నాయకులు మాట్లాడటం వారికి తగదన్నారు. అభివృద్ధి పనులు చేస్తే పవర్ లేని వైస్ చైర్మన్ అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్, రఫి, అన్సర్, బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహబూబ్‌బాషా

మంత్రి మండలి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ సంస్థ ఏర్పాటు కాకముందు ప్రతి సెక్షన్‌లో దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీతభత్యాల చెల్లింపులు సైతం దళారీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదని అన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆప్కాస్ వ్యవస్థ వీటన్నింటికి స్వస్తిపలికి కార్మికులకు సకాలంలో అందేవని తెలిపారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, పాలయ్య, కోశాధికారి శివకుమార్, కిరణ్, చంద్ర పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రొద్దుటూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పొరుగు సేవల కార్మికుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేయాలని గురువారం జరిగిన మంత్రి వర్గం తీర్మానించిందని తెలిపారు. ఈ ప్రకటనతో ఆప్కాస్‌లో ఉన్న కార్మికులందరిలో తీవ్ర భయాందోళన నెలకొందన్నారు. కార్మికుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, సాల్మన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేంద్రబాబు

క్లుప్తంగా

ఆధార్ కేంద్రం నిర్వాహకులపై చర్యలు

ఖాజీపేట : నిబంధనలకు విరుద్ధంగా ప్రజల వద్ద నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతున్న ఆధార్ కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తాహసీల్దార్ మహబూబ్ బాషా అన్నారు. మద్దూరి హరి భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఆధార్ కేంద్రంలో తన వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా వసూళ్లు చేసినట్లు తమకు ఫిర్యాదు చేశారని అన్నారు. ఆ ఫిర్యాదు మేరకు విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. ఆధార్ సెంటర్లలో అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ఖాజీపేట : చౌకదుకాణాదారులు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవ రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి శనివారం తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న జొన్నలు నాశిరకంగా ఉన్నాయని తెలిపారు. చాలా గ్రామాల్లో రేషన్‌లో బియ్యం తక్కువగా ఇస్తున్నారని తెలిపారు. పిచ్చిపాటిపల్లెలో ఒక కార్డుకు 2 కేజీలు బియ్యం తక్కువ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారులు పర్యవేక్షణ లేక పోవడం వలన ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు సక్రమంగా రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

అట్లూరు : గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుందని ఎస్ఐ బి.రామకృష్ణ పేర్కొన్నారు. అట్లూరు క్రాస్ రోడ్డు కూడలిలో శనివారం సీసీ కెమెరాలు అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు, ఘటన జరిగిన వెంటనే బాధితులకు తక్షణ న్యాయం చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

పోరుమామిళ్ల: అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ కొండారెడ్డి అన్నారు. మండలంలోని ఆటో డ్రైవర్లకు శనివారం ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించక పోవడంతో సమస్యలు తలెత్తు తున్నాయన్నారు. అందరూ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

వరిలో తెగుళ్లు, కలుపు నివారణ ప్రత్యేక పరికరం

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు, తుమ్మలపాడు గ్రామాల పరిధిలోని రైతులు రెండో కారులో సాగు చేసుకున్న వరిపైర్లలో తెగుళ్లు, కలుపు నివారణ కోసం ప్రత్యేక యంత్రం తయారు చేసుకుని వినూత్న పద్ధతులలో పనులు చేసుకుంటున్నారు. ఆరు అడుగుల పొడవు గల పైపుకు సన్నటి గొలుసులు మూడు అడుగుల మేరకూ కిందకి వేలాడదీసేలా పరికరం తయారు చేసుకున్నారు. దీనిని ఇద్దరు ఇరువైపులా పట్టుకుని సాగు చేసిన 20 రోజుల లోపల వరి గంటలపై (వరి మొక్కలు) చదును చేసుకుంటూ పోతారు. దీని వలన వరి పైరులో ఉంటే కలుపు మొక్కలు బయటికి రావడం, ఇదే క్రమంలో వరి కొనలపై ఉండే గుడ్లను పగులగొట్టి బయటికి వస్తాయి. ఇలా చేయడం వలన కలుపుతో పాటు వరి పైర్లను ఆశించి క్రిమీ కీటకాలు ఏర్పడకుండా గుడ్డు దశలో నాశమవుతాయని తుమ్మలపాడు, పల్లవోలు గ్రామానికి చెందిన రైతులు భాస్కర్‌రెడ్డి, సాగర్ చెబుతున్నారు. మండలంలోని పల్లవోలుకు చెందిన జెడ్‌బీఎన్ఎఫ్ మెంటర్‌గా ఉన్న రామాంజనేయుల ద్వారా ఇలాంటి విధానం పాటిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ సాగుకు ఏడాదికేడాదికి పెరుగుతున్న ధరలను తగ్గించుకునేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని జెడ్‌బీఎన్ఎఫ్ మెంటర్ రామాంజనేయులు తెలిపారు.



రైతులు వినూత్నంగా తయారు చేసుకున్న పరికరం

బ్రహ్మం మృతిపై దర్యాప్తు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని ఇటుకల బట్టీ వద్ద శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పనబాక బ్రహ్మం మృతిపై దర్యాప్తు చేయాలని మృతుడి సోదరి పనబాక శివలక్ష్మి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 6.30 గంటల సమయంలో ఇటుకల బట్టీ యజమాని ఫోన్ చేసి బ్రహ్మం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడన్నారు. సంఘటనా స్థలంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నిజానిజాలను వెలికి తీయాలన్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసుల తీరుపై తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పనబాక సంధ్యావతి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విజేతలైన విద్యార్థులతో రమ్యకీర్తన, శివదర్శనానంద మాతాజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని విజయవాడ జోనల్ మున్సిపల్ కమిషనర్ బూసా రమ్య కీర్తన పేర్కొన్నారు. స్థానిక శేగిరెడ్డి కల్యాణమండపంలో శనివారం సాయంత్రం రవీంద్ర హైస్కూల్ 28వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలన్నారు. శివదర్శనానంద సరస్వతీ మాతాజీ చదువుతో పాటు నైతిక విలువను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకరరెడ్డి విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చదువు ప్రాముఖ్యతను వివరించారు. చదువులో రాణించిన వారికి ఈ సందర్భంగా మెమెంటోలు అందించారు. కరస్పాండెంట్ పల్లేటి విష్ణుకుమార్‌రెడ్డి, డైరెక్టర్ సౌజన్య, ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌వలి, పవన్, పుష్పరాణి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక వైఎస్సార్ కడప జిల్లా

గోపవరం : వైఎస్సార్ కడప జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. శనివారం కడప నగరంలోని ఐఎంఏ హాలులో నిర్వహించిన వైఎస్సార్ కడప జిల్లా రచయితల మహాసభల ప్రారంభ సమావేశంలో హనుమంతరావు గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ కడప జిల్లా సాహిత్య కీర్తి ఎంతో మహోన్నతమైనదని కొనియాడారు. అనంతరం హనుమంతరావును ఘనంగా సత్కరించారు.

అవార్డు ప్రదానం

బద్వేలు అర్బన్: కడపలోని ఐఎంఏ హాలులో శనివారం నిర్వహించిన వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం మహాసభల సందర్భంగా నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో బద్వేలుకు చెందిన ఇరుపోతు శ్రీనివాసులవర్మ రాసి వినిపించిన కవితా గానానికి ద్వితీయ బహుమతి లభించింది

శుభకార్యాల మాసం.. మాఘ మాసం

- కళకళ లాడుతున్న పట్టుచీరల దుకాణాలు
- బంగారు దుకాణాల్లో పెరిగిన వ్యాపారాలు
- జోరుగా క్రయావిక్రయాలు
- కల్యాణ మండపాలకు పెళ్లి కాంతులు

ప్రొద్దుటూరు క్రైం : మాఘమాసం రానే వచ్చింది.. ఈ ఏడాది కూడా ఈ మాసం మంచి ముహుర్తాలనే మోసుకొచ్చింది.. శుభ గడియలు తెచ్చింది. దీంతో శుభకార్యాల సీజన్ మొదలైంది. పల్లెటూళ్లతో పాటు పట్టణాల్లోనూ సందడి కనిపిస్తోంది. పెళ్లిళ్లు గృహ ప్రవేశాలు తదితర శుభకార్యక్రమాలకు ముందుగా గుర్తుచ్చేది మాఘమాసం. ఎందుకంటే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమైన తర్వాత మొదటగా వచ్చే శుభం మాసంగా దీనిని పండితులు పరిగణిస్తారు. ఉత్తరాయణం పుష్య మాసంలో రావడంతో.. అది శూన్యమాసం కావడంతో శుభ కార్యక్రమాలు చేపట్టరు. కాగా మాఘమాసం ప్రారంభం కావడంతో వివాహాది శుభ కార్యాలయాల సందడి కూడా మొదలైంది.

ప్రొద్దుటూరుకు మాఘ మాసం శోభ

మాఘమాసం వచ్చిందంటే అందరికి మొదటగా గుర్తుచ్చేది పెళ్లిళ్ల సీజన్ వచ్చిందని. పెళ్లి ముహుర్తాలు కూడా సుమారుగా 40 రోజుల పాటు ఉండటంతో వస్త్ర దుకాణాలు, బంగారు దుకాణాలు కళకళ లాడుతున్నాయి. దీంతో ప్రొద్దుటూరుకు మాఘమాసం శోభ వచ్చిందని చెప్పొచ్చు. వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి పొందిన ప్రొద్దుటూరు బంగారు వ్యాపారాలకు ప్రసిద్ధి అనేది అందరికీ తెలిసిందే. ఈ సారి బంగారం బిజినెస్ బాగా జరుగుతుందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మాఘ మాసం ప్రారంభానికి నెల రోజుల ముందే బంగారు నగల తయారీకి ఆర్డర్లు ఇచ్చి కోరిన డిజైన్లను చేయించుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్‌ల నేపథ్యంలో పట్టణంలోని బంగారు దుకాణాలు కిటకిట లాడుతున్నాయి. బంగారు తర్వాత వస్త్రవ్యాపారానికి ప్రొద్దుటూరు ప్రసిద్ధిగాంచింది. ఏపీతో పాటు తెలంగాణాలకు సైతం ప్రొద్దుటూరు నుంచి బట్టలు ఎగుమతి అవుతుంటాయి. ఇక్కడ నాణ్యత కలిగిన పట్టుచీరెలు కూడా లభిస్తాయి. కంచి, పట్టు చీరెలు, ఫ్యాన్సీ పట్టుచీరెలకు మంచి డిమాండు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పెళ్లి ముహుర్తాలను దృష్టిలో ఉంచుకొని సరికొత్త డిజైన్లను తెప్పించినట్లు తెలిపారు.

కల్యాణ మండపాలకు డిమాండు

ప్రొద్దుటూరులో రూ. 20 వేలు మొదలు రూ. 2 లక్షల వరకు బాడుగ తీసుకునే కల్యాణమండపాలు అనేకం ఉన్నాయి. పెళ్లిళ్లను దృష్టిలో ఉంచుకొని రెండు, మూడు నెలల ముందే కల్యాణ మండపాలను బుక్ చేసుకున్నారు. మంటపాలు దొరకనివారు ఇళ్లవద్దనే పెళ్లిళ్లు చేయడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రొద్దుటూరులో సుమారు 60కి పైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. కల్యాణమండపాలకు అయ్యే బాడుగకంటే డెకరేషన్‌కు చాలా మంది ఎక్కువ ఖర్చు పెడుతున్నారు.

అనేక మందికి ఉపాధి

శుభకార్యాలయాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులు, షామియానాసెట్టింగ్‌లు, బ్యాండ్ వాయిద్య కళాకారులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ఆర్కెస్ట్రా, క్యాటరింగ్, బ్యూటీ పార్లర్ నిర్వాహకులు, ట్రావెల్స్ ఏజెన్సీలకు మంచి డిమాండు ఏర్పడింది. అందువల్ల ఆయా వ్యాపార వర్గాల వారికి చేతినిండా పని లభించనుంది. శుభకార్యాలు వారి ఉపాధికి దోహద పడుతున్నాయి.

బంగారు, పూల ధరలు పైపైకి

మార్కెట్‌లో బంగారం ధర రోజు రోజుకు పెరుగుతోంది. ధర స్థిరంగా ఉండకపోవడంతో పెళ్లి అవసరాలు ఉన్నా తీసుకోవడానికి చాలా మంది జంకుతున్నారు. పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో వివిధ వస్తువుల ధరలు, పూల రేట్లు అమాంతంగా పెరిగిపోయాయి. ధరలు పెరిగిన నేపథ్యంలో అవసరం ఉన్న మేరకే పూలను తెప్పించుకుంటున్నారు.